సాక్షి
అనంతపురం
బుధవారం ၊ 4 ၊ డిసెంబర్ ၊ 2024



చీనీ టన్ను రూ.26,690
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,690 ధర పలికాయి.



కిలో టమాట రూ.49
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.49, కనిష్టంగా రూ.33, సరాసరిన రూ.42 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
29.4°/19.6°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

సర్కారు కుప్పిగుంతలు


అనంతపురంలో రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

- గుంతలు లేని రోడ్లంటూ ప్రజల కళ్లకు గంతలు కడుతున్న ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 845 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు అనుమతి
- ఆరు మాసాల్లో 30 కిలోమీటర్లు కూడా పనులు చేయని దుస్థితి
- ఎన్నికల ముందు రోడ్లపై జనసేన నాయకుల హంగామా
- నేడు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా మొహం చాటేస్తున్న వైనం


బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి-గోవిందపల్లి మార్గంలో గుంతలు తేలిన రోడ్డు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'మేం అధికారంలోకి వస్తే తక్షణమే రోడ్ల మరమ్మతులు చేయిస్తాం. ప్రజలు గుంతలు లేని రోడ్లను చూస్తారు' అంటూ ఎన్నికల ముందు డాంబికాలు పలికిన టీడీపీ నేతలు నేడు ఆ విషయం గురించి అడిగితే మొహం చాటేస్తున్నారు. టీడీపీ తానా అంటే తందానా అంటూ గతంలో రోడ్లపైకి తట్టలు తీసుకొచ్చి గుంతలు పూడుస్తున్నామంటూ హంగామా చేసిన జనసేన నాయకులు నేడు అసలు కానరావడమే లేదు. గ్రామాల్లోనే కాదు మున్సిపాలిటీల్లోనూ అధ్వాన రోడ్లపై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

ఆరు నెలలైనా..

జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది నియోజకవర్గాల్లో 845 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. దీనికోసం రూ.19.76 కోట్ల అంచనాతో ప్రణాళిక రూపొందించారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చి ఆరు మాసాలు గడుస్తున్నా ఇప్పటివరకూ 30 కిలోమీటర్లు కూడా వేయలేకపోయారు. పట్టుమని పది ఊళ్లలో రోడ్ల గుంతలు పూడ్చలేదు. కేవలం రూ.70 లక్షలు మాత్రమే వ్యయం చేశారు. చేసిన వ్యయంలోనూ ఉరవకొండలోనే రూ.13.30 లక్షలు వెచ్చించడం గమనార్హం. అనంతపురం, శింగనమలలో పైసా ఖర్చు చేయలేదు. అడుగు గుంత కూడా పూడ్చలేదు.

జిల్లాకేంద్రంలో మరీ దారుణం..

సుమారు మూడున్నర లక్షల మంది జనాభాకు నెలవుగా ఉన్న అనంతపురం నగరంలో రోడ్లు మరీ దారుణంగా తయారయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు చుక్కలు చూపు తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరుతో కాలనీల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపారు. చాలా చోట్ల కొత్తగా రోడ్లు వేశారు. రూ.319 కోట్లతో టవర్‌క్లాక్ వద్ద బ్రిడ్జితో పాటు పంగల్ రోడ్డు వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టారు. నగరానికే మణిహారంలా ఈ రహదారిని తీర్చిదిద్దారు. మిగిలిన రోడ్ల గురించి ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. గుంతలు లేని రోడ్లంటూ ఇంకెన్ని రోజులు కుప్పిగంతులాడతారని నిలదీస్తున్నారు.

జిల్లాలో రోడ్ల మరమ్మతుల వివరాలు

నియోజకవర్గం	మరమ్మతులకు అనుమతి (కి.మీ)	చేసిన పనులు (కి.మీ)
అనంతపురం	47.550	000
రాప్తాడు	23.000	0.20
శింగనమల	229.680	000
తాడిపత్రి	232.280	7.20
గుంతకల్లు	50.912	1.60
ఉరవకొండ	136.995	13.30
కళ్యాణదుర్గం	44.910	5.05
రాయదుర్గం	80.279	2.70


వజ్రకరూరు మండలం కొనకొండ్ల నుంచి ఛాయపురం వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

అభివృద్ధి అటకెక్కింది



నగరంలో అభివృద్ధి అటకెక్కింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లా కేంద్రంలోనే రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. గడప గడపకు మన ప్రభుత్వం తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు వెళ్లి సమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనులు చేశారు. కూటమి ప్రభుత్వంలో పనులన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి.
– కట్టుబడి తనీష, భాగ్యనగర్, అనంతపురం

అధ్వానంగా రోడ్లు



అనంతపురంలో ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వాన స్థితికి చేరాయి. రోడ్లను బాగు చేయిస్తున్నామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి డివిజన్‌లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎంతో మేలు చేశారు.
– వెన్నం శివరామిరెడ్డి, అనంతపురం

తల్లీబిడ్డ మృతిపై విచారణకు కమిటీ

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సోమవారం చోటుచేసుకున్న తల్లీబిడ్డ మృతి ఘటనపై సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు విచారణకు ఆదేశించారు. రాయదుర్గానికి చెందిన మంజునాథ్ భార్య జ్యోతి (30)ని మూడో కాన్పు కోసం గత నెల 27న సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. హైరిస్క్ కేసు పట్ల జాగ్రత్త వహించాల్సి ఉన్నా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించడంతో సోమవారం జ్యోతి బాత్‌రూంలో కిందపడింది. వైద్యులు అప్పుడు చికిత్సలు అందించినా జ్యోతితో పాటు పురిటిలోని బిడ్డ చనిపోయింది. ఈ క్రమంలోనే జిల్లా అధికార యంత్రాంగం ఘటనపై ఆరా తీయడంతో ఆస్పత్రిలో మంగళవారం సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు పలువురు హెచ్ఓడీలతో సమావేశమయ్యారు. హెచ్ఓడీ డాక్టర్ షంషాద్ బేగం వివరణ తీసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేసేందుకు ప్రొఫెసర్లు డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ రవికుమార్, అనస్తీషియా వైద్యులు డాక్టర్ జగదీషాచార్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. రెండు, మూడు రోజుల్లో వీరు విచారణ చేసి సూపరింటెండెంట్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

స్టాఫ్‌నర్సుల తీరుపై అసహనం..

కాగా, మృతి చెందిన పసికందును అట్టపెట్టెలో పెట్టి ఇవ్వడంపై డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు అసహనం వ్యక్తం చేశారు. గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణితో ఆయన మాట్లాడారు. మరోసారి ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా చూడాలని, స్టాఫ్‌నర్సులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలను అందజేయాలని ఆదేశించారు.

5న క్యాంపస్ ఇంటర్వ్యూలు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఈ నెల 5న క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి తెలిపారు. గ్లోబల్ కంపెనీ క్లౌడ్ ఆధారిత హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, బిజినెస్ అవుట్‌సోర్సింగ్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అకడమిక్ కెరీర్‌లో (పదో తరగతి, ఇంటర్, డిగ్రీ) కనీసం 60 శాతం మార్కులు కలిగి ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. జంతలూరు క్యాంపస్‌లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

'కేఎస్‌ఆర్'లో వేధింపుల కలకలం


కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వేధింపుల కలకలం రేగింది. ఓ టీచరు తమపై ఎక్కడపడితే అక్కడ చేతులు వేస్తున్నాడంటూ 8వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థినులు మాట్లాడినట్లుగా ఉన్న వాయిస్ రికార్డులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫిజికల్ సైన్స్ టీచరు నడుంపై గిచ్చుతున్నాడని, చివరి పీరియడ్‌లో ఎన్ఎంఎంఎస్ తరగతిలో భుజంపై చేయి వేశాడని, తన నడుం పట్టుకున్నాడని, గ్లాసుతో కరుచుకుని తాగిన నీటిని తనను తాగమని చెప్పాడని, ఎక్కడ పడితే అక్కడ తాకుతున్నాడంటూ విద్యార్థినులు అందులో మాట్లాడినట్లు ఉంది. ఈ క్రమంలో ఇటీవల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి గొడవ చేయగా.. తాను ఏ ఒక్క విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించలేదని, కేవలం కొందరు పనికట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని సదరు టీచరు వాపోయినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై హెచ్ఎం నారాయణ 'సాక్షి'తో మాట్లాడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచరును విచారించామన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా గట్టిగా మందలించారన్నారు. కొందరు తోటి టీచర్లే పనికట్టుకుని విద్యార్థినులతో ఇలా మాట్లాడించి సోషల్ మీడియాలో వైరల్ చేయిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పెట్రోల్ బంకులపై విజిలెన్స్ దాడులు

అనంతపురం: నగరంలోని పలు పెట్రోల్ బంకులపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో డీఎస్పీ నాగభూషణం పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టారు. పెట్రోల్, డీజిల్ నాణ్యత, కొలతలలో వ్యత్యాసాలు వస్తే పెట్రోలియం యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఏఓ జే. వాసు ప్రకాష్, అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


రాప్తాడు వైఎస్సార్ సర్కిల్లో బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

రాప్తాడు: రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. మంగళవారం రాప్తాడులో వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి, రాప్తాడు జంక్షన్, అయ్యవారిపల్లి క్రాస్ వద్ద బ్లాక్ స్పాట్స్‌ను ఎన్‌హెచ్ అధికారులతో కలిసి ఎస్పీ జగదీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యవారిపల్లి క్రాస్ వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. అయ్యవారిపల్లి క్రాస్ నుంచి రాప్తాడు హైవే వరకు ఐరన్ బ్యారికేడ్ ఏర్పాటు చేయాలని, దీంతో ద్విచక్ర వాహనాదారులను హైవేపై రోడ్డు దాటకుండా చేయవచ్చన్నారు. డ్రైవర్లు అతి వేగం, అజాగ్రత్తతో వాహనాలు నడిపి ఎంతో మంది ప్రాణాలు బలిగొంటున్నారని చెప్పారు. మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అనవసరంగా ప్రాణాలను పోగొట్టుకుని కుటుంబ సభ్యులను అనాథలను చేయవద్దని సూచించారు. ఎస్పీ వెంట అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ టీ.వీ.శ్రీహర్ష తదితరులు ఉన్నారు.

జిల్లాకు వర్షసూచన



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 29.5-30.5, రాత్రి ఉష్ణోగ్రతలు 23.0-23.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 84-95 శాతం, మధ్యాహ్నం 60-68 శాతంగా నమోదవుతాయన్నారు.

సేవా లోపం.. బ్యాంకుల మూల్యం

అనంతపురం: వినియోగదారులకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యం చూపిన రెండు బ్యాంకులకు జిల్లా వినియోగదారుల న్యాయస్థానం జరిమానాలు విధించింది. ఈ మేరకు న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యులు బి. గోపీనాథ్ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. గుంతకల్లు పట్టణానికి చెందిన ఏఆర్ హరిహరన్‌కు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్‌తో పాటు ఇంటర్నేషనల్ డెబిట్ కార్డు, ట్రావెల్ ఫారెక్స్ కార్డుల సదుపాయం ఉంది. ఫొటోషూట్ నిమిత్తం గతేడాది అక్టోబర్ 6 నుంచి నాలుగు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో పర్యటించాలని హరిహరన్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బ్యాంకు నుంచి ట్రావెల్ ఫారెక్స్ కార్డు సేవల్ని పొందడానికి ప్రయత్నించాడు. 24 గంటల్లో సేవలు అందుబాటులోకి వస్తాయని బ్యాంకు వారు హామీ ఇచ్చినా విఫలమైంది. దీంతో ప్రయాణానికి రెండు రోజుల ముందు కూడా మరో సారి సంప్రదించాడు. ప్రయాణమయ్యేలోపు సేవలు యాక్టివేట్ అవుతాయని బ్యాంకు సిబ్బంది భరోసా ఇవ్వడంతో హరిహరన్ థాయ్‌లాండ్ చేరుకున్నారు. అయితే, అక్కడ



కార్డు పనిచేయకపోవడంతో కంగుతిన్నాడు. ఇబ్బందులు పడి ఎలాగోలా తిరిగి వచ్చిన ఆయన.. దీనిపై జిల్లా వినియోగదారుల న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం సేవాలోపానికి గానూ రూ.లక్ష పరిహారంతో పాటు లీగల్ ఖర్చుల కింద రూ.3 వేలను 45 రోజుల్లోగా చెల్లించాలని, లేని పక్షంలో 9 శాతం వడ్డీ చెల్లించాలని తీర్పు వెలువరించారు.

- మరో ఘటనలో జేఎన్‌టీయూ ఓటీఆర్ఐ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చక్కా గోపీనాథ్ ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు విషయంలో బ్యాంకు సేవాలోపంపై ఫిర్యాదు చేశారు. పాన్ కార్డు వివరాలు అందించకపోతే క్రెడిట్ కార్డు బ్లాక్ అవుతుందని కొన్ని రోజుల క్రితం ఓ ఫోన్‌కాల్ వచ్చిందన్నారు. ఈ క్రమంలో తాను బ్యాంకు వారిని సంప్రదించి కార్డు బ్లాక్ చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. దీంతో తన క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డుల నుంచి తన ప్రమేయం లేకుండా భారీ మొత్తంలో పలు వ్యాపార సంస్థలకు చెల్లింపులు జరిగాయన్నారు. అయితే, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు చెల్లింపుల్లో తమ ప్రమేయం ఏమీ ఉండదని, వినియోగదారుడే జాగ్రత్తగా ఉండాలని బ్యాంకు వారు పేర్కొనగా.. న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు బ్యాంకులు జవాబుదారీతనంతో ఉండాలన్నారు. ఫిర్యాదుదారుడికి జరిగిన మోసపూరితమైన లావాదేవీలకు సంబంధించి రూ.4,98,651 మొత్తాన్ని 45 రోజుల్లోగా 9 శాతం వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశించారు. అలాగే ఫిర్యాదురారు పడిన మనోవేదనకు రూ.లక్ష పరిహారంగా చెల్లించాలని, వీటికి అదనంగా మరో రూ.10 వేలను కోర్టు ఖర్చుల కింద చెల్లించాలని తీర్పు వెలువరించారు.

'విభిన్న' తీరు.. 'ప్రతిభావంతుల' బేజారు


కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివ్‌నారాయణ శర్మ, అధికారులు

అనంతపురం రూరల్/సిటీ/ఎడ్యుకేషన్: విభిన్న ప్రతిభావంతులను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. 'ఇప్పుడేం ఎన్నికలు లేవు.. వారితో మనకేం పని' అన్నట్లు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీల అమలు సంగతి దేవుడెరుగు.. కనీసం వారిని గుర్తించే స్థితిలో లేరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వివరాలు.. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఎంపీలతో పాటు అన్ని నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలే ఉన్నా ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ప్రజాప్రతినిధుల తీరుపై పలువురు విభిన్న ప్రతిభావంతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో విభిన్న ప్రతిభావంతులకు 'అది చేస్తాం, ఇది చేస్తాం' అని చెప్పిన నాయకులు నేడు తమను కనీసం గుర్తించకపోవడం అన్యాయమని మండిపడ్డారు.

ఆత్మస్థైర్యం కోల్పోవద్దు..

కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివనారాయణశర్మ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. అన్ని రంగాల్లో రాణించి అందరికీ స్ఫూర్తిగా నిలవాలన్నారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్‌రసూల్, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి తదితరులు పాల్గొన్నారు.

నష్టం మిగిల్చిన వర్షం

అనంతపురం సెంట్రల్: 'ఫెంగల్' తుపాను ఉమ్మడి జిల్లాపై గణనీయ ప్రభావం చూపింది. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం ఉదయం వరకూ రాప్తాడు, కంబదూరు, కళ్యాణదుర్గం, కంబదూరు, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, ఉరవకొండ, శెట్టూరు, గుమ్మఘట్ట మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 42 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో వరిపంట పూర్తిగా నేలవాలింది. నూర్పిడి చేసి కళ్లాల్లో ఉంచిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. నల్లరేగడి భూముల్లో సాగు చేసిన పప్పుశనగ పంట దిగుబడిపై కూడా తుపాను ప్రభావం చూపే అవకాశాలున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బొమ్మనహాళ్ సమీపంలో నేలకొరిగిన వరిపంట

'ఉపాధి' నిధులు మింగేశారు

- రూ.కోటికి పైగా అవినీతి
- కప్పిపుచ్చేందుకు అధికారుల ప్రయత్నాలు

విడపనకల్లు: ఎన్ఆర్ఈజీఎస్‌లో ఉపాధి అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. రూ.కోటికి పైగా ప్రభుత్వ సొమ్మును దారి మళ్లించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన 18వ విడత ప్రజావేదికలో ఈ విషయం వెల్లడైంది. వివరాలు.. మండలంలోని 18 పంచాయతీల్లో ఈ ఏడాది మార్చి 31 నుంచి నవంబర్ 18 వరకూ నిర్వహించిన ఉపాధి హామీ పనులను ఇటీవల ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలోని 7 టీంలు తనిఖీలు చేశాయి. ఆ వివరాలను మంగళవారం ప్రజావేదికలో వెల్లడించారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, హౌసింగ్ పథకాల కింద రూ.10,90,86,179 ఖర్చు చేస్తే అందులో రూ.1.23 కోట్లు పక్కదారి పట్టించారని తెలిపారు. పాల్తూరులో దాదాపు రూ. 33 లక్షలు, కరకముక్కలలో దాదాపు రూ.13 లక్షలు, విడపనకల్లులో రూ.7 లక్షలు, కడదరబెంచిలో రూ.2 లక్షలు, డొనేకల్లులో రూ.5 లక్షలు, గడేకల్లులో రూ. లక్ష, హావళిగిలో రూ.12 లక్షలు, మాళాపురంలో రూ.2.15 లక్షలు, ఆర్.కొట్టాలలో రూ.లక్ష, వేల్పుమడుగులో రూ.8.30 లక్షలు, చీకలగురికిలో రూ.4.48 లక్షలు, జనార్దనపల్లిలో


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్పీ

రూ.4 లక్షలు, ఉండబండలో రూ. 8.79 లక్షలు, పాలికిలో రూ. 25.81 లక్షల మేర ప్రభుత్వ ధనం పక్కకు మళ్లినట్లు తెలిపారు.

కప్పిపుచ్చేందుకు యత్నాలు..

ఉపాధి సిబ్బంది ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడినట్లు వెల్లడికాగా, విచారణకు వచ్చిన అధికారులు మాత్రం కేవలం రూ.25 లక్షల రికవరీకి ఆదేశించడం గమనార్హం. డ్వామా పీడీ సలీం బాష, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డిలు అవినీతికి పాల్పడిన ఏపీఓ, టీఏలు, ఫీల్డు అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను కాపాడే ప్రయత్నం చేశారు. దీనిపై పలు ప్రజా సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్కా రికార్డులతో అక్రమాలను బహిర్గతం చేసినా విచారణ అధికారులు ఇలా ప్రవర్తించడం సరికాదని మండిపడ్డారు. ప్రతి సారి రికవరీ రాసి వెళ్లిపోతున్నారు తప్పా ఎక్కడా సొమ్ము రికవరీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ ఏపీడీ శైలజ, ఎంపీడీఓ షకీలాబేగం, ఏపీఓ సంజీవ్‌కుమార్, జెడ్పీటీసీ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై మరీ ఇంత నిర్లక్ష్యమా?

అనంతపురం కార్పొరేషన్: రైతాంగం పట్ల కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సర్కారు అలసత్వం కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. అన్నదాలను ఆదుకుంటామంటూ గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు నేడు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. జిల్లా రైతులకు గతేడాది నుంచి ఇన్సూరెన్స్ అందలేదన్నారు. అతి వృష్టి, అనావృష్టితో జిల్లావ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయినా కేవలం 7 మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించి తీరని ద్రోహం చేశారన్నారు. మిరప, వేరుశనగ, కంది, సద్ద పంట రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో కష్టాలే మిగులుతున్నాయన్నారు. కంది పంట దిగుబడులు తగ్గిపోతున్నా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కణేకల్లు ప్రాంతంలో వడ్లను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేసినా అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. మద్దతు ధర దక్కక రైతులు ఇబ్బందులు పడుతున్నారని


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

స్వయంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు డీఆర్‌సీలో అన్నారంటే క్షేత్రస్థాయిలో ఎంత అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

'అన్నదాత సుఖీభవ' ఎక్కడ?

'అన్నదాత సుఖీభవ' పథకం ప్రవేశపెట్టి రైతులకు రూ.20 వేలు ఇస్తామంటూ ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక మాట తప్పారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలుకు రూ.4 వేల కోట్లు అవసరముంటే, బడ్జెట్‌లో కేవలం రూ. వెయ్యి కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. ఇన్సూరెన్స్ డబ్బును రైతులకు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు భీమలింగప్ప, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెడ్ల పరువు బజారుకీడ్చొద్దు

- ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి


మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి, తదితరులు

అనంతపురం టవర్‌క్లాక్: వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం రెడ్ల పరువును బజారుకీడ్చడం సబబు కాదని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి హితవు పలికారు. మంగళవారం అనంతపురంలోని రెడ్డి జన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కాసాని గోవర్ధనరెడ్డి, చంద్రమోహనరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు రాజకీయ లబ్ధి కోసం రెడ్ల పరువును బజారుకు పెడుతున్నారని, ఇది సరైంది కాదన్నారు. దీని వల్ల ఇతర సామాజిక వర్గాల ముందు రెడ్లు చులకనయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. తక్షణమే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రొద్దం సురేష్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, శేషాద్రి రెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, జయవర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

విషజ్వరంతో అంగన్‌వాడీ టీచర్ మృతి


సుశీలమ్మ

బొమ్మనహాళ్: విషజ్వరంతో బాధపడుతూ బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుశీలమ్మ (55) మృతి చెందింది. బంధువులు తెలిపిన మేరకు.. 15 రోజుల క్రితం తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సుశీలమ్మ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. అనంతరం అదే రోజు ఇంటికి చేరుకున్న ఆమె సొమ్మసిల్లి పడిపోవడంతో కుటుంబసభ్యులు వెంటనే బళ్లారిలోని బిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. 15 రోజులుగా కోమా నుంచి ఆమె బయట పడకపోవడంతో చివరకు కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక మంగళవారం మృతి చెందింది.

నేడు రైల్వే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు

గుంతకల్లు: రైల్వే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఎన్నికలు సజావుగా సాగేలా డివిజన్ వ్యాప్తంగా 34 కేంద్రాల్లో 170 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6.00 గంటలకు వరకు పోలింగ్ ఉంటుంది.

జెడ్పీ సీఈఓ విధుల్లో చేరికపై వీడని సందిగ్ధత

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి విధుల్లో చేరికపై సందిగ్ధత నెలకొంది. మూడు నెలల క్రితం నంద్యాల జిల్లా డ్వామా పీడీ ఆర్.రామచంద్రారెడ్డిని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అంతకు ముందే ఆయన అమెరికా వెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నారు. దీంతో డిప్యూటీ సీఈఓగా నియమితులైన వెంకటసుబ్బయ్యకు సీఈఓ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ.. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రారెడ్డి ఆదివారం విధుల్లో చేరాల్సి ఉంది. సోమవారం కూడా విధులకు హాజరు కాకపోవడంతో సందిగ్ధత నెలకొంది.

వైద్యం.. దైవాధీనం!

రోజూ ఔట్ పేషెంట్లు
2 వేల నుంచి 2,500

ఇన్ పేషెంట్లు
1,100 నుంచి 1,300



అభా కార్డు రిజిస్ట్రేషన్ చేయిస్తున్న దృశ్యం, ఓపీ కోసం వెళ్లిన తల్లి ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో గుక్కపట్టి ఏడుస్తున్న పసికందు

- ఓపీకి రెండు గంటల సమయం
- అబా కార్డు నమోదులో గంటల తరబడి నిరీక్షణ
- ఈ ప్రక్రియ పూర్తికాగానే అందుబాటులో లేకుండా పోతున్న వైద్యులు
- జీజీహెచ్‌లో సొమ్మసిల్లి పడిపోతున్న ఓపీ రోగులు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో వైద్యం దైవాదీనంగా మారింది. వైద్యుల వద్దకు వెళ్లేకంటే ముందే ఓపీ చీటీ తీసుకోవడంలోనే రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడలేక సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఇక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేదల ఇబ్బందులు మాటల్లో చెప్పలేనివి.

ఓపీ చీటీ తీసుకునేలోపు పత్తాలేని వైద్యులు

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ 2 వేల మంది వరకు రోగులు చికిత్స కోసం సర్వజనాస్పత్రికి వస్తున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఓపీ చీటీలు ఇస్తారు. ఈ సమయంలోనే వారు వైద్య సేవలు అందుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ ఓపీ చీటీ జారీలో ఆలస్యం చోటు చేసుకుంటే ఆ రోజుకు చికిత్స అందని ద్రాక్షగానే మారుతోంది. జీజీహెచ్‌లోని ఏ విభాగంలోనూ వైద్యులు నిర్ణీత వేళలను పాటించకపోవడమే ఇందుకు కారణం. ఆస్పత్రి ఆవరణలోని నాలుగు ఓపీ కౌంటర్లలో గంటల తరబడి బారులుతీరి చీటీ తీసుకున్న అనంతరం షెడ్డు ఆరు బయట ఉన్న స్టాఫ్‌నర్సులతో అబా కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యేందుకు దాదాపు రెండు గంటల సమయం పడుతోంది. ఇక అక్కడి నుంచి వార్డుకి వెళ్లే లోపు వైద్యులుంటే సరి.. లేకపోతే ఆ రోజుకు రూ.వందలు ఖర్చు చేసుకుని నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది.

పేరుకే 'అభా'

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) పేరుతో ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సులు చేస్తున్న రోగుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొత్తం ఓ ప్రహసనంగానే మారింది. వాస్తవానికి అభా నమోదు ప్రక్రియ అనేది వైద్య సేవలను సులభతరం చేయడమే కాక, రోగికి సత్వర నాణ్యమైన సేవలు అందించేందుకు దోహదపడుతోంది. ఒక్కసారి అభాలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ రోగి పేరుపై ఓ ఐడీ జనరేట్ అవుతుంది. ఆ తర్వాత ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా సంబంధిత ఓపీ విభాగంలో ఆ ఐడీ నంబర్‌ను కంప్యూటర్‌లో వైద్యుడు ఎంటర్ చేయగానే రోగికి సంబంధించిన పాత రికార్డులన్నీ కనిపిస్తాయి. దీని ఆధారంగా గతంలో ఏ తరహా చికిత్స అందజేశారు. దాని ఫలితాలు ఏమిటి? ప్రస్తుతం ఎలాంటి చికిత్స అందజేయాలో డాక్టర్ నిర్ధారించుకునేందుకు వీలవుతుంది. ఇదెలా ఉన్నా.. జీజీహెచ్‌లోని మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్స్, సర్జరీ, ఆర్థో, పల్మనాలజీ, డర్మటాలజీ,, ఈఎన్‌టీ, తదితర విభాగాల్లో అభా ఐడీ పరిశీలించి చికిత్స అందించే సౌలభ్యం లేదు.

సొమ్మసిల్లిన గర్భిణి



నాలుగు నెలల గర్భంతో ఉన్న వెంకటాపురం గ్రామానికి చెందిన హసీనా... వైద్య పరీక్షల నిమిత్తం ఆశా కార్యకర్త ఫకృబీతో కలసి మంగళవారం సర్వజనాస్పత్రికి వచ్చింది. గంటకు పైగా క్యూలో నిల్చొన్న ఆమె ఉన్నఫలంగా సొమ్మసిల్లిపడిపోయింది. దీంతో ఆశా వర్కర్ ఫకృబీ వెంటనే ఆమెకు ఉపశమన చర్యలు చేపట్టడంతో కాస్త కోలుకుంది. ఇలాంటి దృశ్యాలు సర్వజనాస్పత్రిలో రోజూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఆస్పత్రి అధికారుల బాధ్యతారాహిత్యానికి రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఈ అవస్థలు పడలేం



నా భర్త నరసింహులు, నేను ఇద్దరమూ చికిత్స కోసం వచ్చాం. క్యూలో నిలబడి ఓపీ చీటీ తీసుకునేందుకు అరగంటకు పైగా పట్టింది. నా భర్త ఇంకా క్యూ లైన్‌లోనే ఉన్నాడు. ఆయన ఎప్పుడు వస్తాడో తెలియదు. ఈ లోపు ఏదో కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోమంటున్నారు. నాకేమో చదువురాదు, సెల్‌ఫోన్ లేదు. ఇవన్నీ తీసుకుని డాక్టర్ దగ్గరికి ఎప్పుడు పోవాలో కూడా తెలియడం లేదు. ఏంది సార్ మాలాంటి ముసోళ్లకు ఈ కష్టం. ఈ అవస్థలు పడలేం. ముందే బాగున్నాది. చికిత్స కోసం వస్తే త్వరగా చూసి పంపేవారు.

– రామాంజినమ్మ, మారుతీనగర్, అనంతపురం

కాలు విరిగింది... గంట నుంచి వేచి ఉన్నా



నా బిడ్డ సింధూ స్కూల్‌కు వెళ్తూ కింద పడింది. దీంతో కాలులో ఎముక విరిగినట్లుగా కన్పిస్తోంది. దీంతో చికిత్స కోసం సర్వజనాస్పత్రికి వచ్చాం. నేను పాప వద్ద ఉన్నా. నా భార్య లలిత క్యూలో నిల్చోంది. గంటకుపైగా అవుతోంది. నొప్పితో బిడ్డ బాధపడుతోంది. ఓపీ చీటీ తీసుకుని మేము పోయే సరికి డాక్టర్ లేకపోతే పాప పరిస్థితి ఏమిటి? పెద్ద సార్లు కాస్త ఓపిక చేసుకుని త్వరగా ఓపీ సేవలందించేలా చూడాలి.

– మారుతి, కడదరకుంట గ్రామం, కూడేరు మండలం

రేణుకా యల్లమ్మ సొసైటీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు


నాగేశ్వరరావుగౌడ్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం రాయల్‌నగర్‌లోని రేణుకా యల్లమ్మ దేవాలయం అనుబంధంగా ఉన్న రేణుకా యల్లమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడిగా జగలేటి నాగేశ్వరరావుగౌడ్ విజయం సాధించారు. అధ్యక్ష పదవికి పోటీ నెలకొనడంతో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 437 ఓట్లకు గాను 389 ఓట్లు పోలు కాగా, 212 ఓట్లు నాగేశ్వరరావుగౌడ్‌కు, 177 ఓట్లు గోపాల్‌గౌడ్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా నాగేశ్వరరావుగౌడ్‌ను వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ అభినందించారు. అందరూ కలిసికట్టుగా ఉండేలా ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేశామని, ఒకరిద్దరి అభిప్రాయ భేదాల వల్ల ఎన్నికలు అనివార్యమయ్యాయని రమేష్‌గౌడ్ అన్నారు. గోపాల్‌గౌడ్ ప్యానల్‌ను కలుపుకొని అమ్మవారి ఆలయం, కళ్యాణమంటపం అభివృద్ధికి, జిల్లాలోని ఈడిగ (గౌడ) కులస్తుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈడిగ కులస్తులందరూ ఐక్యంగా ఉంటూ సమష్టిగా ముందుకు పోదామని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


వెంకటేష్ (ఫైల్)

పామిడి: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని బ్రాహ్మణవీధిలో నివాసముంటున్న బోయ ఆంజనేయులు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వెంకటేష్ (26) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితులు నరేష్, గోపితో కలసి సంతమార్కెట్‌లోని ఓ రేకుల షెడ్‌లో మద్యం సేవించి అర్ధరాత్రి బయటకు వస్తూ రాడ్‌ను తాకగానే విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన స్నేహితులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు మంగళవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని మార్చురీలో ఉన్న వెంకటేష్ మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

తిరుగుబాటుకు సిద్ధం కండి

- కౌంటర్ కేసులను ఆనవాయితీగా చేయొద్దు ప్రభాకర్
- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి హితవు


చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిని పరామర్శిస్తున్న పెద్దారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాడిపత్రిలో అరాచకం రాజ్యమేలుతోంది. ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి, ఆయన తండ్రి, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రేరేపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదు. బాధితుల పక్షాన నిలిచి పోలీసులు ఎలాగూ చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. ఇప్పటికైనా జేసీ ఆగడాలపై తిరుగుబాటుకు సిద్ధంకండి' అంటూ తాడిపత్రి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలం వేములపాడులో టీడీపీ నాయకులు సోమవారం జరిపిన దాడిలో గాయపడి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దపుల్లారెడ్డి, చిన్నపుల్లారెడ్డిలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఘటనపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత వైద్యులను కోరారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడంతో పాటు బాధితులపై కౌంటర్ కేసులు పెట్టే ఆనవాయితీని జేసీ ప్రభాకరరెడ్డి తీసుకువస్తున్నాడని మండిపడ్డారు. ఈ విధానానికి స్వస్తి చెప్పకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోలీసులు సైతం జేసీ ప్రభాకర్ రెడ్డి డైరెక్షన్‌లోనే నడుచుకుంటూ ఊరు వదిలి వెళ్లాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులను ఒత్తిడి చేస్తుండడం సిగ్గు చేటన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దిగజారి ప్రవర్తిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తాను తాడిపత్రికి వెళ్తానని ఎస్పీ జగదీష్‌కు విన్నవిస్తే.. శాంతిభద్రతల సమస్య తలెత్తుందని చెబుతున్నారని, అయితే తాను లేకపోయినా తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా శాంతిభద్రతలు దిగజారాయన్న విషయాన్ని ఎస్పీ గమనించకపోవడం బాధాకరమన్నారు. తాజాగా తాడిపత్రి అభివృద్ధి పేరుతో చిరు వ్యాపారుల నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి చందా వసూలు చేస్తున్నారన్నారు. అలాగే మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి వ్యాపారాన్ని తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రోత్సహిస్తూ వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు.

హోంగార్డుపై టీడీపీ నేత దౌర్జన్యం

శింగనమల: మండలంలోని ఉల్లికల్లు గ్రామానికి చెందిన టీడీపీ నేత రంగారెడ్డి తనపై దాడికి ప్రయత్నించాడంటూ శింగనమల పీఎస్‌లో పనిచేస్తున్న హోంగార్డు నాగేంద్ర మంగళవారం సీఐ కౌలుట్లయ్యకు ఫిర్యాదు చేశారు. వివరాలు... సెప్టెంబరులో ఒక రోజు రాత్రి నాయనపల్లి క్రాస్ నుంచి మరువకొమ్మ వరకూ హెడ్ కానిస్టేబుల్ గిరి మహేష్‌తో కలసి, హోంగార్డు నాగేంద్ర గస్తీ విధులు నిర్వర్తించాడు. ఆ సమయంలో టీడీపీ నేత ఉల్లికల్లు రంగారెడ్డికి చెందిన టిప్పరులో అక్రమంగా ఇసుక తరలిస్తుండడం గుర్తించి పోతురాజుకాలువ సమీపంలో అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. దీంతో అప్పటి నుంచి హోంగార్డు నాగేంద్ర ఎక్కడ కనిపించిన రంగారెడ్డి కోపంతో దుర్భాషలాడేవాడు. ఈ క్రమంలో మంగళవారం నాయనవారిపల్లిలో జరిగిన శుభకార్యానికి ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్ రాజు హాజరు కానుండడంతో ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబులు, సిబ్బందితో ఎస్కార్ట్ విధుల్లో నాగేంద్ర కూడా పాల్గొన్నాడు. అక్కడ సిబ్బంది భోజనం చేస్తున్న సమయంలో నాగేంద్రపై రంగారెడ్డి దాడికి ప్రయత్నించాడు. అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది అడ్డుకోవడంతో నీ కథ చూస్తా అంటూ బెదిరిస్తూ వెళ్లిపోయాడు. టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐకి బాధితుడు ఫిర్యాదు చేశాడు.

కుటుంబంలో ప్రేమ చిచ్చు

- మనస్తాపంతో తల్లి ఆత్మహత్య..
- కుమార్తె ఆత్మహత్యాయత్నం


శ్రీలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి రూరల్: వేరే కులానికి చెందిన వ్యక్తిని కుమార్తె ప్రేమించడంతో మనస్తాపం చెంది తల్లి ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుమార్తెను బంధువులు తప్పుపట్టడంతో ఆమె కూడా ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని నవరంగ్ టాకీస్ రోడ్డులో కిరాణ కొట్టు నిర్వహిస్తున్న శ్రీనివాసులు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీజ... వేరే కులానికి చెందిన వ్యక్తిని ప్రేమించింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించారు. దీంతో శ్రీజ ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం స్థానిక ఐశ్వర్య విల్లాలోని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన తల్లి శ్రీలక్ష్మి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బంధువులు శ్రీజను దోషిగా చూస్తూ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీజ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వెంటనే కుటుంబసభ్యులు కాపాడి ఆమెను అనంతపురంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనపై అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



గుంతకల్లు టౌన్: విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలు ముందు హామీనిచ్చిన కూటమి పెద్దలు అధికారం చేపట్టిన తర్వాత ట్రూఅప్ చార్జీల పేరిట రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మండిపడ్డారు. గుంతకల్లులోని సీఐటీయూ కాలనీలో మంగళవారం జరిగిన సీపీఎం 5వ మహాసభలో ఆయన ప్రసంగించారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణలో, ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టారు. ఇసుక, మద్యం మాఫియాల ఆగడాలు మితిమీరిపోయాయని, మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో చంద్రబాబు సర్కారు విఫలమైందన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులా?

అనంతపురం అర్బన్: హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేయకుండానే లైనింగ్ పనులు చేపడితే జిల్లాకు నష్టం చేకూరుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 405 పరస్పర విరుద్ధంగా ఉందని విమర్శించారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇందుకు విరుద్ధంగా ఇచ్చిన జీఓను ఆక్షేపిస్తున్నామన్నారు. కర్నూలు జిల్లాలో లైనింగ్ పనులు చేయకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎందుకు చేస్తున్నారో స్పష్టత ఇవ్వాలన్నారు. రూ.936.70 కోట్ల లైనింగ్ పనులను 12 ప్యాకేజీల కింద విభజించడం వెనుక జిల్లా రైతుల కంటే వ్యక్తుల ప్రయోజనాలే ముఖ్యమనే విషయం అర్థమవుతోందన్నారు.

చిట్టచివరన ఉన్న చెరువుకు తొలుత నీరు

కూడేరు: పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడికాలువ చిట్టచివరన ఉన్న తాడిమర్రి మండలం అగ్రహారంలోని చెరువును తొలుత నింపుతామని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో తాగునీటి అవసరాల కోసం పీఏబీఆర్ నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.22 లక్షల విలువ చేసే 310 గ్రాముల బంగారం, కారు స్వాధీనం

ఇద్దరు భార్యలు.. ఏడుగురు పిల్లలను పోషించలేక ఓ పెయింటర్ దొంగగా మారాడు. పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించే సమయంలో పాత నేరస్తులతో పరిచయం పెంచుకుని ఓ ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. పట్టుమని మూడు పదుల వయసులోనే ముఠా నాయకుడిగా చలామణి అవుతూ ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో విచ్చలవిడిగా దొంగతనాలు సాగిస్తూ వచ్చాడు. చివరకు అనంత పోలీసులకు పట్టుబడి ఊచలు లెక్కిస్తున్నాడు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న దొంగల ముఠా సభ్యులను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.22 లక్షల విలువైన 310 గ్రాముల బంగారం, ఓ కారు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు.

ఒక్కడే... 41 కేసుల్లో నిందితుడు..

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ ఖాజాపీరా అలియాస్ ఖాజాకు ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలు ఉన్నారు. పెయింటింగ్ పనులతో జీవనం సాగించేవాడు. అయితే పెయింటింగ్ పనులతో వచ్చే సంపాదన ఆయన ఖర్చులకు, కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. దీంతో దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకుని అనంతపురం ఉమ్మడి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో 14, కర్ణాటకలోని బాగేపల్లిలో 4, కోలార్ జిల్లాలో 5, తెలంగాణాలోని షంషాబాద్‌లో 4 దొంగతనాలు సాగిస్తూ మొత్తం 27 కేసుల్లో పోలీసులకు పట్టుబడి రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో చోరీ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ధర్మవరం పట్టణానికి చెందిన మహేష్, జమీర్‌తో పరిచయడం ఏర్పడింది. ఏడాది తర్వాత ముగ్గురూ బయటకు వచ్చారు. అనంతరం ముగ్గురూ ముఠాగా ఏర్పడి చోరీలకు తెరలేపారు. అనంతపురం రూరల్, త్రీ టౌన్, ఫోర్త్ టౌన్, యాడికి, ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో 10, కర్ణాటకలోని కోలార్‌లో 4 దొంగతనాలు మొత్తం 14 చోరీ కేసుల్లో వీరు ప్రధాన నిందితులు. గతంలో జరిగిన చోరీ కేసులతో కలుపుకుంటే ఖాజా ఒక్కడిపైనే మొత్తం 41 కేసులు ఉన్నాయి.

డ్రైవింగ్ ఒకరు.. చోరీలు చేసేది మరొకరు..

చోరీలు చేయడంలోనూ ఆరితేరిన ముగ్గురూ ఓ పథకం ప్రకారం ముందుకు సాగారు. తొలుత తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకుని ఓ అద్దె కారును తీసుకుని జమీర్ డ్రైవింగ్ చేస్తాడు. మహేష్ ఇంటి బయట కాపలా కాస్తుండగా ఖాజా ఒక్కడే లోపలకు ప్రవేశించి విలువైన ఆభరణాలు అపహరిస్తాడు. అనంతరం అద్దె కారులో ఉడాయించి చోరీ సొత్తును పంచుకునేవారు.

ప్రత్యేక బృందాల నిఘాతో గుట్టురట్టు..

తాళం వేసిన ఇళ్లల్లో చోరీ కేసుల దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జగదీస్ ఆదేశాల మేరకు అనంతపురం సీసీఎస్ సీఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిఘా పెట్టాయి. ఈ క్రమంలో అందిన పక్కా సమాచారంతో సీఐ ఇస్మాయిల్, అనంతపురం రూరల్ సీఐ శేఖర్ ... ముగ్గురు నిందితులను అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న రజాక్ ఫంక్షన్ హాలు సమీపంలో అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 310 గ్రాముల బంగారు నగలు, ఓ కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు ఇస్మాయిల్, శేఖర్, ఎస్ఐ రాంబాబు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మల్లికార్జున, చంద్రశేఖర్, గిరిబాబు, జయకర్, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ఆంజనేయప్రసాద్, రంజిత్, బాలకృష్ణ, షామీర్, రాజశేఖర్‌ను ఎస్పీ అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు.

క్లుప్తంగా

డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ప్రారంభం



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: డ్రోన్ల ఆపరేటింగ్‌పై శిక్షణను జిల్లా ఎస్పీ పి. జగదీష్ మంగళవారం ప్రారంభించారు. 30 మంది సిబ్బందికి డ్రోన్లు, ఆపరేటింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయి. ఓపెన్ డ్రింకింగ్, పేకాట, గంజాయి సేవించడం, ఈవ్‌టీజింగ్, ఒంటరిగా వెళ్లే అమ్మాయిలను బెదిరించడం, చోరీలకు పాల్పడడం, చైన్ స్నాచింగ్ చేసి పరారయ్యే వారిపై నిఘా పెట్టడానికి డ్రోన్లు దోహదపడనున్నాయి. 3 కిలోమీటర్ల పరిధిలో జరిగే అంశాలను డ్రోన్లు పసిగట్టనున్నాయి. అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా, సైబర్ విభాగం సీఐ షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య వర్ధంతిని సెలవు దినంగా ప్రకటించాలి

అనంతపురం టవర్‌క్లాక్: మాజీ ముఖ్య మంత్రి రోశయ్య వర్ధంతిని సెలవు దినంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ రాయలసీమ పొలిటికల్ అడ్వైజర్ చైర్మన్ వంకదారు వెంకట కృష్ణ కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం మాజీ ముఖ్యమంత్రి రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ కూలీలకు సూచించారు. మంగళవారం గొరిదిండ్ల గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ కింద పనులు కల్పిస్తామన్నారు. రోజుకు రూ.300 వరకు వేతనం అందుతుందని తెలిపారు. కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే పని కల్పిస్తారన్నారు. అనంతరం ఉపాధి హామీ కింద నిర్మించిన షెడ్లు, ఫారంపాండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



సనపలో కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: సనప గ్రామంలో మంగళవారం కనకదాస జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వసికేరప్ప స్వామి గుడి వద్ద కురుబ కులస్తులు గొరవయ్యలకు పాలు పోశారు. యల్లమ్మ గుడి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కనకదాస చిత్రపటానికి పూల మాలలు వేసి టెంకాయలు కొట్టి పూజలు చేపట్టారు. అనంతరం గ్రామంలో కనకదాస చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహించారు.

నూతన గేటు ప్రారంభం

ఆత్మకూరు: తహసీల్దార్ కార్యాలయానికి ఏర్పాటు చేసిన నూతన గేటును తహసీల్దార్ లక్ష్మీనాయక్ మంగళవారం ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం గేటు ఇటీవల శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో స్పందించిన తహసీల్దార్ కొత్త గేటు ఏర్పాటు చేయించారు. ఈ మేరకు తహసీల్దార్ ఎంపీడీఓ లక్ష్మినరసింహతో కలిసి గేటును ప్రారంభించారు. ఏపీఓ సుజిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

ఆత్మకూరు: దివ్యాంగులు ఏవిషయంలోనూ కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు తెలియజేశారు. మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆత్మకూరులో ర్యాలి నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులకు పలు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. వికలత్వం ఉన్న పిల్లల్ని తక్కువ చూపు చూడరాదని, వారి తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఐఈ ఆర్‌టీఎస్ అరుణకుమారి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

శునకాల దండయాత్ర!

- మూడు నెలల్లో 1062 మందికి కుక్కకాటు
- నగరంలో కుక్కల స్వైర విహారం
- పిక్కలు పీకేస్తున్న శునకాలు
- నగరంలోనే 500 మందికిపైగా బాధితులు



నగరంలో రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న శునకాలు



అనంతపురం కార్పొరేషన్: నగరంలో కుక్కలు దండయాత్ర చేస్తున్నాయి. వీధుల్లో గుంపులుగుంపులుగా సంచరిస్తూ కనిపించిన వారిపై దాడికి తెగబడుతున్నాయి. రాత్రి,పగలు తేడా లేకుండా దాడులు చేస్తుండటంతో నగర ప్రజలు కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన నగరపాలక సంస్థ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు కుక్కల స్టెరిలైజేషన్‌కు రూ.14 లక్షలు చెక్కును సునాయాసంగా ఇచ్చేశారు. కానీ ఇంత వరకు నగరంలో కుక్కల బెడదను నివారించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వందల సంఖ్యలో బాధితులు...

నగరంలోని సాయినగర్, హౌసింగ్ బోర్డు, సెవెన్ హిల్స్ కాలనీ, ఆదర్శనగర్, నాయక్‌నగర్, నీరుగంటి వీధి, రాంనగర్, లక్ష్మీనగర్, రహమత్‌నగర్, జీసస్‌నగర్, విద్యుత్‌నగర్, 1, 2, 3, 4 రోడ్లు, ఆజాద్‌నగర్, బీకేఎస్, శింగనమల, ఏ నారాయణపురం, రుద్రంపేట, రాజీవ్ కాలనీ, అనంతపురం రూరల్, నుంచి కుక్కకాటు బాధితులు అధిక సంఖ్యలో సర్వజనాస్పత్రికి వస్తున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మూడు నెలల్లో 1062 మంది యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ను విడతల వారీగా వేసుకున్నారు. వీరిలో 60 శాతం నగరవాసులు ఉన్నట్లు ఆస్పత్రి రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 25 వరకు 363, సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 25 వరకు 583, అక్టోబర్ 26 నుంచి నవంబర్ 25 వరకు 656 మంది ఏఆర్‌వీ వేయించుకున్నారు. గత నెలలోనే ఏకంగా 600 మందికిపైగా కుక్కకాటు బాధితులుండడం గమనార్హం. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మిగితా ప్రాంతాల్లో పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

బయటకు రావాలంటే భయమేస్తోంది



మా వీధిలో గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. రాత్రంతా మొరుగుతూనే ఉంటాయి. హేయ్ అని అదిలించే లోపే కుక్క కాటు వేసింది. అక్కడున్న వాళ్లు గట్టిగా అరవడంతో వెళ్లిపోయాయి. చిన్నపిల్లలకు కాటు వేస్తే ఎలా సార్. నగరంలో కుక్కలు బెడదను నివారించాలి. – కుళ్లాయమ్మ, బిందెల కాలనీ

స్టెరిలైజేషన్ మొదలుపెడతాం

కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియ ఆగిపోయింది. అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా నుంచి సదరు ఏజెన్సీకి రికగ్నేషన్ సర్టిఫికెట్ రావాల్సి ఉంది. ఈ ఏడాది ఆగస్టులో వెల్ఫేర్ బోర్డు వారు తనిఖీ చేశారు. సర్టిఫికెట్ వచ్చాక స్టెరిలైజేషన్‌ను మొదలుపెడతాం. – డాక్టర్ విష్ణుమూర్తి, ఎంహెచ్‌ఓ

అందరికీ ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకోండి

- నగర మేయర్ వసీం



మసీదు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం కల్చరల్: ఈద్గా మసీదు ముందున్న కాంప్లెక్స్ విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని మేయర్ వాసీం నలీం అధికారులను కోరారు. హైవే నిర్మాణంలో భాగంగా మంగళవారం స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న ఈద్గా మసీదు ముందు భాగం కూల్చివేతపై అధికారులు సర్వేకు రావడంతో మసీదుల ముతవల్లీలు, మత పెద్దలు, వివిధ మైనార్టీ సంఘాల నాయకులు నిరసన తెలియజేశారు. నగర మేయర్ వాసీం మాట్లాడుతూ నగర సుందరీకరణలో భాగంగా రూ.300 కోట్లతో రోడ్డు నిర్మాణాన్ని గత ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మసీదు ముందు కొంత భాగాన్ని తొలగించేలా అందరినీ ఒప్పించారన్నారు. ఇందుకోసం రూ.9.80 కోట్ల పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. అయితే ప్రభుత్వం మారిపోవడంతో సమస్య మళ్లీ మొదటకు వచ్చిందన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ అందరూ ఒప్పుకున్న తర్వాతే అదీ కేవలం కొంత భాగం మాత్రమే తొలగించాలన్నారు. ముతవల్లీల రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్‌షఫీ మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పాటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మసీదు ఆస్తులను పరిరక్షిస్తామన్న హామీ ఇచ్చారని, అందకనుగుణంగా ఎవరికీ ఇబ్బంది కల్గని రీతిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు దాదా గాంధీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్, బీజేపీ నాయకులు ఫయాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, కమల్‌భూషణ్ తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అంతకు ముందు డీఎస్పీ శ్రీనివాసులు , ఆర్డీఓ కేశవనాయుడు, మునిసిపల్ కమిషనర్ నాగరాజు, ఎమ్మార్వో హరిప్రసాద్, సర్వేయర్ ప్రతాపరెడ్డి, నేషనల్ హైవే అధికారులు ముస్లిం పెద్దలతో చర్చలు జరిపారు. రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు.

చేతివృత్తిదారులకు రుణాలివ్వాలి

అనంతపురం రూరల్: బీసీ కార్పొరేషన్ ద్వారా చేతివృత్తిదారులకు రుణాలు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యంను కలిసి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులపై చర్చించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన బీసీలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి రజక, నాయి బ్రహ్మణ, గొర్రెలు, మేకల పెంపకం దార్లు, మేదర్లు, కుమ్మర్లు, చేనేత, గీత కార్మికులతో పాటు స్వర్ణ కారులకు రుణాలు అందించాలన్నారు. సీపీఐ నాయకులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల చైతన్యంతోనే సమాజాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ బీ.ఎన్.శ్రీదేవి

రాప్తాడు: మహిళలు చైతన్యవంతులైతేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ పీడీ బి.ఎన్. శ్రీదేవి అన్నారు. మంగళవారం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో టీటీడీసీ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మహిళ హింస వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ మహిళలపై జరిగే హింసను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సృష్టికి మూలమైన మహిళామూర్తిని గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళా సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు తెచ్చిందని, అయినా పలుచోట్ల లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు జరగడం బాధాకరమన్నారు. అందరూ కలిసికట్టుగా పోరాడితేనే స్త్రీ హింసా నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన 1098 టోల్ ఫ్రీ నంబర్ బాలికలకు బాసటగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ ప్రతాప్ రెడ్డి, జేడీఎం సూర్యనారాయణ, జెండర్ ఏపీఎం భాస్కర్ నాయుడు, వన్‌స్టాప్ సెంటర్ శాంత, టీటీడీసీ మేనేజర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం



పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రజలకు సేవ చేయడంలో పోలీసు ఉద్యోగానికి మించిన కొలువు లేదని, పోలీసు ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అన్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ ఖాదర్‌బాషా, జిల్లా ఏఆర్ విభాగం ఆర్ఎస్ఐ ముస్తఫా, వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేయడంతో జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ మంగళవారం వారిని ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా ముగించడం ప్రశంసనీయమన్నారు. అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి (అడ్మిన్), ఇలియాజ్ బాషా (ఏఆర్), డీటీసీ డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఆర్ఐలు మధు, రాముడు, జిల్లా పోలీసు పాలనాధికారి శంకర్, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్

రాప్తాడు: విభిన్న ప్రతిభావంతులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో ఆర్డీటీ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 4 నుంచి 8 శాతం మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారన్నారు. వీరి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తున్నారన్నారు. వీటన్నింటిని విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలని తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం- 2016, మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్- 2017ను వివరించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించిన విజేతలుక బహుమతులు పంపిణీ చేశారు.

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనితను విభిన్న ప్రతిభావంతులైన వర్సిటీ ఉద్యోగులు కలిసి విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు పెద్దన్న, వైస్ ప్రెసిడెంట్ ఎం. మల్లికార్జున, సెక్రటరీ రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులుగా పీటీసీ మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. పారా అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన వారికి ఇండోర్‌స్టేడియంలో బహుమతులు అందజేశారు. పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు, సెక్రటరీ శ్రీనివాసులు, స్పందన ఆర్గనైజేషన్‌కు చెందిన చరణ్ నందా, కోచ్ ఎంఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై పోరాటాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

అనంతపురం అర్బన్: మహిళల సమస్యలు, హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తున్నామని మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి అన్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న మహిళా సమాఖ్య 22వ జాతీయ మహాసభల్లో మహిళల సమస్యలపై విస్తృతంగా చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ భారత జాతీయ మహిళ సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 1954లో ఏర్పాటైందన్నారు. నాటి నుంచి నేటి వరకు మహిళల సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధనకు సాగిన పోరాటాలు, ఉద్యమాలకు సమాఖ్య సారథ్యం వహిస్తోందన్నారు. జిల్లా ప్రతినిధులుగా తాము ఇక్కడి సమస్యలను మహాసభ దృష్టికి తీసుకెళతామన్నారు. సమాఖ్య అధ్యక్షురాలు పార్వతిప్రసాద్, నగరాధ్యక్షురాలు జానకి, గౌరవాధ్యక్షురాలు సమ్మక్క, నేతలు యశోదమ్మ, లక్ష్మిదేవి, స్వాతి, ఆజీబి, వరాలమ్మ, జయలక్ష్మి, రుక్మిణమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి ముత్తురేవులు శివ కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బందికి ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ భూతం తాండవిస్తోందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలతో ఎయిడ్స్ వ్యాపించే అవకాశం ఉందన్నారు. డిస్పోజబుల్ సూదులు, సిరంజీలనే వాడాలని, లైసెన్స్ ఉన్న రక్తనిధి నుంచే రక్తాన్ని సేకరించాలని తెలిపారు. విస్తృత అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అనంతపురం ఎడ్యుకేషన్: సంభవ్ ఫౌండేషన్, కియా సంయుక్త ఆధ్వర్యంలో యువతకు వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశా రు. డేటా ఎంట్రీ ఆపరేటర్, డేటా అనలిస్ట్, అకౌంట్స్ రిసీవబుల్ అండ్ అకౌంట్స్ పేబుల్, అకౌంట్స్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ చేసిన విద్యార్థులు అర్హులు. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కళాశాలలో అభ్యర్థు ల ఎంపిక ఉంటుంది. పూర్తి వివరాలకు 79819 89190, 96184 88031లో సంప్రదించవచ్చు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్

సర్వజనాస్పత్రిలో ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్రవాహనదారులు ఆస్పత్రి ప్రాంగణంలో ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. ప్రభుత్వాస్పత్రి సిబ్బంది రోగులను తరలించడానికి అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఆర్థో వార్డు ముందు వాహనాలు నిలిపిన దృశ్యం



ద్విచక్ర వాహనాలు అడ్డుగా ఉండడంతో రోగిని తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్న ఆస్పత్రి సిబ్బంది

అభినందన



బ్లడ్ బ్యాంకు సిబ్బందిని అభినందిస్తున్న డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకు సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మంగళవారం అభినందించారు. ఉత్తమ సేవలందించిన జీజీహెచ్ బ్లడ్ బ్యాంకుకు ఏపీ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు 43 బ్లడ్ డొనేషన్ క్యాంపులు, నిర్వహించారని, అందులో 9,645 యూనిట్ల రక్తాన్ని సేకరించి, ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే 7,704 మందికి రక్తం అందించారన్నారు. అలాగే 1077 ప్లేట్‌లెట్లు రోగులకు అందించడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో బ్లడ్ బ్యాంకు సిబ్బంది పని చేయాలని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. రక్తనిధి వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు, స్టాఫ్‌నర్సు సుజాత, సురేష్, టెక్నీషియన్లు మురళీ, రమణారెడ్డి, పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని వినతి

అనంతపురం అర్బన్: నగర పాలక సంస్థలో పని చేస్తున్న కార్మికులకు 4 నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఎస్సీ మునిసిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.అజయ్‌బాబు తెలిపారు. కలెక్టరేట్ నుంచి బయలుదేరి వెళుతున్న కలెక్టర్ అక్కడున్న కార్మికులను చూసి కారు ఆపించి వారితో మాట్లాడారు. దీంతో ఆయనకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్, మలేరియా, గార్బేజీ వర్కర్లు, మినీ జేసీబీ, క్లాప్ ఆటో డ్రైవర్లకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ మునిసిపల్ ఆర్డీ, కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు తిరుపాల్, ఉపాధ్యక్షుడు కె.సురేష్‌బాబు, కార్యదర్శి జూటూరు పెద్దన్న పాల్గొన్నారు.

బైక్ అపహరణ

అనంతపురం: నగరంలోని మార్కెట్ యార్డులో మంగళవారం బైక్ అపహరణకు గురైంది. అశోక్ కుమార్ అనే వ్యక్తి బైక్‌ను మార్కెట్ యార్డ్ గేటు వద్ద పార్కింగ్ చేసి లోపలకి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేటి నుంచి పాలిటెక్ ఫెస్ట్

అనంతపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధ, గురువారాల్లో పాలిటెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి. జయచంద్రారెడ్డి తెలిపారు. జిల్లాలోని 17 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొననున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: శ్రీకంఠం సర్కిల్ సమీపంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. వారి నుంచి రూ.30,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కోర్టు కేసులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: కోర్టు కేసులను ఎలాంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని అధికారులకు డీఆర్‌ఓ ఎ.మలోల సూచించారు. కేసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఫైలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కోర్టు కేసుల అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్‌తో కలసి అన్ని శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. కోర్టు కేసులను ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా కంటెప్ట్‌కు దారి తీసే పరిస్థితి వస్తుందన్నారు. కేసులకు సంబంధించి డైరీ లేదా రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ప్రధానంగా కోర్టు కేసుల ఫైళ్లను చూసే సెక్షన్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ వాటిని ఎప్పటికప్పుడు తమ శాఖల అధికారి దృష్టి తీసుకెళ్లాలన్నారు. వివిధ శాఖల పరిపాలనాధికారులు, సెక్షన్ ఉద్యోగులు పాల్గొన్నారు.